# నువ్వెందుకు పుట్టావ్?

పోలాప్రగడ జనార్దనరావు

మనిషికి ఓరోజు వున్నట్టుండి అనుమాన మొచ్చింది ఈ సృష్టిలో వున్న జీవాలు, నిర్జీవాలు యెందుకు సృష్టించబడ్డాయని అనుమాన మొచ్చిందే తడవుగా కార్యక్రమంలోకి దిగాడు యెదురుగావున్న చెట్టుతో ప్రారంభించాడు తన రీసెర్చి

"చెట్టూ, చెట్టూ, నువ్వెందుకు పుట్టావు?"

"తరువాత చెబుతాలే మొదట అడగవలసిన ప్రశ్న చివర్ని ఆఖరున అడగవలసిన విషయం ముందర ప్రస్తావించడం మీ మనుషులకు వున్న జబ్బే"

"అయితే మరి నువ్వు కష్టపడి తయారుచేసుకున్న ఫలాలు మా మనుషులు దొంగిలిస్తూ వుంటుంటే నీకు బాధగా వుండదూ!"

"నానుంచి ఫలితం ఆశించి నాకు సేవ చేసి నీరుపోసిన మనిషికి నా ఫలాలు పనికి వస్తున్నాయంటే నాకెంతో తృప్తి"

"నిన్ను నరికి వంట చెఱకుగా వినియోగించుకుంటుంటే నీకు బాధగా వుండదూ?"

"నా నీడక్రింద విశ్రాంతి తీసుకున్న మనుషులే నన్ను వాళ్ళ భుక్తికోరి నరుకుతున్నారంటే నా ప్రాణంలేని కట్టె కూడా వాళ్ళకు ఉపయోగిస్తు వుంటుందంటే, వాళ్ళ నిర్జీవమైన శరీరంకంటె నా నిర్జీవమైన కట్టెకే విలువుందనీ, వాళ్ళ కట్టెను కాల్చడానికి కూడా నేనే ఉపయోగపడుతున్నానంటె నా కంతకంటె జన్మరాహిత్యం ఏంకావాలి ఇప్పుడర్థమయ్యిందా నీ మొదటి ప్రశ్నకు సమాధానం" అంటూ బాటసారులకు చక్కని గాలిని ప్రసాదించే హడావిడిలో పడిపోయింది చెట్టు

వెంటనే మనిషికి అడిగడిగిన ప్రశ్నల వల్ల దాహంవేసి వెంటనే నీరు త్రాగడానికి వెళ్ళి మళ్ళీ మొదలెట్టాడు తన పరిశోధన

"అసలు నువ్వెందుకు పుట్టావు,నిన్ను మేం అనేక రకాలుగా ఉపయోగిస్తూ నానా హింసలు పెడుతోంటే బాధగాలేదూ?"

గల గల నవ్వింది నీరు

"పిచ్చివాడా సృష్టి నాలోంచే ప్రారంభమయ్యింది నేను లేకపోతే సృష్టి యుద్ధం జరగడానికి సరైన స్థలమే వుండేదికాదు

నేను తరిగిపోతున్నా మీకు దప్పి తీరుస్తున్నా నేను ఆవిరి అయి కరిగిపోతున్నా ఆనందంతో తేలిపోతున్నా తిరిగి మళ్ళీ మీ దగ్గరగే వస్తానుగా కాస్త చల్లగాలి తగలగానే అదే తృప్తి నీవే గాక మిగతా జీవరాసులన్నీ నన్ను ఉపయోగించుకొని చెత్తగా విసర్జించినా అల్లాగే నామరూపాలు లేకుండా పాతాళానికి పోతున్నా మళ్ళీ నన్ను కాస్త కదిలిస్తే ఉప్పొంగే ఉత్సాహంతో మీ దగ్గరకి తన్నుకు వస్తానన్న ఆనందం

నాకుంది ఇప్పు డర్థమయ్యిందా నేనెందుకు పుట్టానో నేను పుట్టకపోతే ఏమయ్యేదో?''

వెంటనే మనిషికి భయం పుట్టుకొచ్చింది ప్రతి ప్రాణి, ప్రతి నిర్జీవరాసి కూడ యెందుకో అందుకు ఉపయోగపడుతున్నాయి మరి మరి తను ఆత్మ విమర్శన ప్రారంభమయ్యింది

ఇంతలో 'అంబా అంటూ ఆవు అటుగా వెడుతూ ఏమిటీ నీబాధ అన్నట్టుగా అడిగింది

వెంటనే మనిషికి సిగ్గేసింది బాధపడుతున్న మనిషిని చూసి పశువు 'ఏమిటి నీ బాధ' అని అడిగిందే మరి నోరున్న తను ఎంతమందికి కనీసం సాయం చెయ్యకపోయినా అడిగాడు అబ్బే ఎక్కడ బాధ గురించి అడిగితే సాయం చెయ్యవలసి వస్తుందోనని భయం అయినా అహం చావక "నా తరువాత నువ్వేకదా సృష్టిలో నిన్నుకూడా ఇంటర్వ్యూ చేస్తానుండు" అన్నాడు

''నీకు కొంచం గడ్డేసి నీవల్ల మేం ఎన్నోవిధాల లాభాలు పొందుతున్నాం నీ విసర్జాల దగ్గరనుంచి మాకు భుక్తిని కల్పిస్తున్నాయి నీ పేరు నీ బిడ్డలపేరు రాజకీయంగా ఉపయోగించుకుని కనీసం తరువాత నీ పేరుకూడా తలవడంలేదే? మరి నువ్వు ఎందుకు మమ్మల్ని అసహ్యించుకోవు? ఎందుకు మామీద సమ్మె చెయ్యవు?''

"వెర్రి పిల్లాడా? ఆది బ్రహ్మ ఆజ్ఞ అనుసరించి అన్ని జీవరాసులు నడుచుకుంటున్నాయ్ కదా! మేం కూడా అంతే నన్ను తృప్తిగా దువ్వి నా మీద నమ్మకం వుంచుకొని పిల్లల్ని కంటున్న తల్లులకి మేం పాలివ్వకుండా ఎలా వుండగలం బుల్లాడా చిన్నప్పుడు మామీద వ్యాసం చదువుకో లేదూ" అంటూ పాలివ్వడానికి వెళ్ళిపోయింది ఆ గోమాత

నాగార్జునుడు "సృష్టిలో పనికిరాని ఆకుంటే పట్టుకురండి" అన్నాట్ట తన శిష్యులతో గురుదక్షిణగా అసలు పనికి రాని ఆకు కాదుకదా వస్తువే లేదని తన రీసెర్చివల్ల తెలుసుకున్నాడు మనిషి కాని

కాని మరి తనమీదే కాస్త అనుమానమేసి మళ్ళీ తర్కం ప్రారంభమయ్యింది మరి మరి తను చేసిందేమిటి? చేస్తున్నదేమిటి? చెయ్యాల్సిందేమిటని?

ఇంతలో మూకుమ్మడిగా జీవరాసులు, నిర్జీవరాసులన్నీ కలిసి తన దగ్గరకు వస్తున్నట్టుగా గమనించాడు ఎందుకొస్తున్నాయో గ్రహించాడు ఎల్లా సమాధానం ఇవ్వాలి అని మధనపడి ఆఖరికి అర్థమయినట్టు తల ఆడించుకున్నాడు

అనుకున్నట్టుగానే అన్నీ వచ్చాయి వచ్చి, "మమ్మల్ని అన్నీ అడిగావుకదా! మరి నువ్వెందుకు పుట్టావ్? నీ పనేమిటి?" అని అడిగాయి

అతితెలివి నవ్వొకటి వాటిమీద విసరి "మీరు అందిస్తున్నవన్నీ అనుభవించటానికి" అంటూ భోంచెయ్యడానికి వెళ్ళిపోయాడు ఆ పెద్దమనిషి □

